# శిక్ష

చింకిబొంతలో పడుకుని మూలుగుతున్నాడు నాలుగేండ్లవయస్సుగల జగం. అతని దేహంలోని అస్థిపంజరం పైకి కనబడుతూంది, కన్నులు లోతుకుపోయి మూసుకునివున్నాయి. అతను బలువుగా వూపిర్ని పీలుస్తున్నాడు. గుండెలో నొప్పి లేస్తూండడంచేత కాళ్ళు వుండుండి కిరకిర చుట్టుకుపోతున్నాడు. జ్వరతీవ్రంచేత కలిగిన మమతలో అప్పుడప్పుడు 'అమ్మా!' అని పలవరిస్తాడు. ఆ నాలుగేండ్ల జీవితన లేతనోరుతో యెంతో ఆశతో 'అమ్మా' అని పలవరించుతే పలకడాని కతనకి అమ్మ యెక్కడుంది? కాని అక్కడనే అతనిపక్కనే కూచుని కళ్ళల్లోనికి పరువులిడుతున్న నీళ్ళన్నింటినీ యెండిపోయిన గొంతుకులోనే దిగమింగుకుంటున్న నీలాద్రి, అతను పలవరించినవెంటనే చటాల్న లేచి 'నాన్నా! నా నాయనా! నాతండ్రీ! నాజగం! ఎందుకమ్మా పిలుస్తున్నావు?' అని యెంతో ఆతృతతో అడుగుతాడు. కాని అతనిప్రశ్నకి జగం ఉఁ ఉఁ అనే మూలుగే జవాబు.

నీలాద్రి లేచి ముక్కాలిపీటమీద వెలుగుతున్న మినుకుమినుకు బుడ్డీదీపం పురపురలాడుతూవుండగా దాన్ని హెచ్చుచేశాడు. మళ్ళాకూచుని జగంవేపు చూస్తున్నాడు.

జగం కిరకిర చుట్టుకుంటున్నాడు.

నీలాద్రి మనస్సులో డాక్టరు అరగంటకిందట చెప్పినమాటలు మెరుపుల్లా పరుగెత్తాయి. 'నీకొడుకు యింక గంటన్నరో.... లేక రెండుగంటలకన్నా హెచ్చు....కాని యిరవై రూపాయలుగాని నువ్వు యిచ్చావంటే ఇంజక్షనిస్తాను. మరి ఫరవాలేదు.' అన్నాడు డాక్టరు. తను డాక్టరు పాదాలమీదపడి 'డాక్టరుగారూ! నేను నిరుపేదను. నామీద నా జగంమీద దయతలచండి. నా జగాన్ని బతికించండి' అని బతిమాలాడు. డాక్టరు 'ఇరవై రూపాయలు—మందు ఖరీదు' అంటూ తన మొరలను వినకుండానే చింకిబొంతలో జ్వరబాధచేత మూలుగుతున్న ఆ దీనజీవినయినా చూడకుండానే చరచర వెళ్ళిపోయాడు.....ఇలాగనే గడచిన సంగతుల్ని స్మరించుకున్నాడు.

తన జగం....తన జగం....తన్ను విడిచి యింకోగంటలో—వెక్కి వెక్కి యేడుస్తున్నాడు.

ఇరవై రూపాయలుంటేనా....ఒక్క యిరవై యుంటేనా ...తన జగం చక్కాలేచి కూచుంటాడు. 'నాన్నా' అంటూ యెంతో ముద్దుగా పిలుస్తూ కిచకిచ నవ్వుతూ వచ్చి తనవొళ్లో కూచుంటాడు. కాని యిరవై రూపాయలే! ఎలాగునవస్తాయి? తిరిగి యేడుస్తున్నాడు.

ఏడుపును బలవంతంగా వొక్కసారిగా దిగమింగుకున్నాడు. మంచందగ్గిరకి వెళ్లాడు. జగం యిందాకటిలాగునే ఉఁ ఉఁ అని మూలుగుతున్నాడు. నీలాద్రి అక్కడనుంచి కదిలి ద్వారందాటాడు.

అవతల, మృత్యుదేవత కేశపాశంలాగుంది చీకటి. ఆ చీకట్లో యెక్కడికో యెందుకో బయలుదేరాడు. రెండుమూడు వీధులు తిరిగాడు. ప్రతివీధీ నిర్జనంగావుంది. అవును అంత రాత్రివేళ నిద్రమానుకుని వీధుల్లో యెవరుతిరుగుతారు తానుతప్ప? నీలాద్రి వొక మేడదగ్గర నిలబడి పోయాడు.

రెండుమూడుసార్లు తనచుట్టూ పరికించి వొకసారి మేడమీదికి తన చూపులను సారించాడు.

*   *   *   *

ఆ మేడమీద వరండాలోనుంచి చప్పుడు కానట్లు యెత్తియెత్తి మెల్లగా అడుగులు వేస్తూ నడుస్తున్నాడు నీలాద్రి. అతను గదులో ప్రవేశించాడు. కిటికీదగ్గరున్న మంచంమీద శాలునకప్పుకుని గుర్రుతీస్తూ నిద్రిస్తున్న ఆయింటియజమాని వేపొక సారి, చిలుకకొయ్యకు తగల్చబడివున్న ఆ యజమాని సిల్కుకోటువంక నొకసారి చూశాడు. ఆసిల్కుకోటులోని పర్సులో యిరవైరూపాయలుండవా—రెండు పదేసి రూపాయల నోట్లుండవా?—జగం... తనజగం బతికిపోతాడు! బతికిపోతాడు. అడుగు ముందువేశాడు. టేబిలుమీద తగ్గించబడివున్న లాంతరు అతన్ని బెదర కొట్టింది. అతను లాంతరునార్పి చిలుక కొయ్యదగ్గరకు వెళ్తున్నాడు. ఆ చీకటిలో అతని కాలుతగిలి పీకుదానా తిరగబడి చప్పుడు చేసింది.

యజమాని త్రుళ్ళిపడి లేచాడు. గది నిండా చీకటి. చీకటిలో యెవరో? 'దొంగ! దొంగ' అంటూ బెదురుగొంతుకుతో కేకలు వేశాడు యజమాని. దొంగ గదులో నుంచి అవతల కొక్కదాటు వేశాడు, కాని—

వరండాలో నీలాద్రిని యిద్దరు బంట్రోతులు పట్టుకున్నారు. నిమిషంలో అందరూ అక్కడ పోగైనారు. యజమాని తన కాలి చెప్పును తీసి దాంతో నీలాద్రి దవడమీద చరిచాడు. నీలాద్రిపళ్ళు రెండు వూడినాయి. అక్కడనున్న ప్రతిమనిషీ అతన్ని తంతు న్నారు. ఆఖరికి యజమానికొడుకు, నాలు గేండ్ల అబ్బాయికూడా నీలాద్రిని తన్నాడు. నీలాద్రి ఆ అబ్బాయివేపు అదేపనిగా చూస్తూండగా అతని కన్నులవెంబడి నీళ్ళు జలజల ప్రవహించాయి. 'నాయనా! నన్ను మరోసారి తన్నవూ?' అని ఆ అబ్బాయిని అడిగాడు నీలాద్రి.

పోలీసులు వచ్చారు. చేతులకు బేడీలను బిగించి నీలాద్రిని స్టేషనుకి తీసుకుపోతు న్నారు.

—మల్లాది అవధాని.

# తీర్థసేవ

సీ. పాడిదగ్గు కంఠంబుఁ బొరిపుచ్చకయమున్న తలప్రకంపంబుఁ బొందకయమున్న
బొమలు కన్నులమీఁదఁ బొదవి వ్రాలకమున్న పొర నేత్రములకడ్డు చొరకమున్న
శ్రుతి పుటంబులశక్తి సురిఁగి పోవకమున్న వళు లాననమునఁ బర్వకయమున్న
హృదయంబులో జాగ పదను దప్పకమున్న గాత్రంబు శిథిలంబు గాకమున్న

గీ. పండ్లు వేర్వాసి కదలుచూంపకయమున్న కాకి కడకంటిపై చూపు రాకమున్న
కాలుసేయాడు తఱి యంద కదలవలయుఁ దీర్థసేవకు దేహ మస్థిరముగాన.

—కాశీఖండము.